క్లుప్తంగా

మూల పెద్దమ్మ ఆలయంలో భక్తుల సందడి


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గడివేముల: మండల కేంద్రంలోని మూలపెద్దమ్మ ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ వంటి విశేష పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు వాల్మీకిసేవా సమితి ఆధ్వర్యంలో అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

సచివాలయ ఉద్యోగులపై ఎంపీడీఓ ఆగ్రహం


సి.బెళగల్ సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

సి.బెళగల్: మండల కేంద్రంలోని సి.బెళగల్-2 సచివాలయ ఉద్యోగులపై ఎంపీడీఓ రాణెమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం గ్రామ సచివాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. కొందరు ఉద్యోగులు హాజరు రిజిస్టర్‌లో సంతకాలు చేసి అందుబాటులో లేకపోవడాన్ని గుర్తించారు. ప్రజలకు స్థానికంగానే సేవలందించేందుకే సచివాలయ వ్యవస్థ ఉందని.. బాధ్యత లేకుంటే ఎలా అని మండిపడ్డారు. దీనిపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఇలాంటి తప్పులు పునరావృతం అయితే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రభుత్వాస్పత్రుల్లో సురక్షిత ప్రసవం


వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న వైద్యాధికారులు

సి.బెళగల్: ప్రభుత్వాస్పత్రుల్లో సురక్షిత ప్రసవాలు జరుగుతాయని.. ప్రసవాల సంఖ్యను పెంచేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని పోలకల్ పీహెచ్‌సీ డాక్టర్లు హరిచంద్రుడు, శ్రావణి అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బందితో సమీక్షించారు. గ్రామాల్లో గర్భిణులు, మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు రెగ్యులర్‌గా తమ పరిధిలోని మహిళలకు ఆరోగ్య జాగ్రత్తలు తెలియజేయాలని సూచించారు. అదే విధంగా సీజనల్ వ్యాధులు, నివారణ చర్యలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు, చికిత్సలు తీసుకునే విధంగా చూడాలని తెలిపారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. సీహెచ్‌ఎస్ శకుంతల, హెల్త్ సూపర్‌వైజర్ ప్రభావతి, రాజశేఖర్, రాజ్ మియ్యా, లెప్రసీ అధికారి నారాయణ ఉన్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



కర్నూలు(రూరల్): నగర సమీపంలోని వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి కుంకుమార్చన, ఆకు పూజ, వడిబియ్యం, నైవేద్యం సమర్పించి పూజలు చేశారు.

కర్ణాటక మద్యం ధ్వంసం


పట్టుబడిన మద్యం, సారాను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

కోడుమూరు రూరల్: కోడుమూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 12 కేసుల్లో పట్టుబడిన కర్ణాటక మద్యం 414 లీటర్లు, 7 కేసుల్లో పట్టుబడిన 125 లీటర్ల నాటుసారాను మంగళవారం స్థానిక పాత హంద్రీ బ్రిడ్జిపై ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ మంజుల తెలిపారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామక్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో మద్యాన్ని ధ్వంసం చేశామన్నారు. ధ్వంసం చేసిన మద్యం విలువ రూ.30 వేలు ఉంటుందని పేర్కొన్నారు.

దాడి ఘటనపై చర్యలు తీసుకోవాలి

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లెలో అంగన్‌వాడీ కార్యకర్తపై దాడి ఘటనపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలవెంకట్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం. నిర్మలమ్మ, సునీత కోరారు. నిందితుడిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం ఎస్పీని కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు.

మిర్చి.. కన్నీళ్లు మిగిల్చి..!

- భారీగా పడిపోయిన ఎండు మిర్చి ధరలు
- ఖర్చులకు కూడా రాని పరిస్థితి
- గత ఏడాదితో పోలిస్తే భారీగా పడిపోయిన ధరలు
- ఆందోళనలో రైతులు


వైరస్ సోకడంతో దెబ్బతిన్న మిర్చి పంట


ఎండుమిర్చిని గుంటూరు మార్కెట్‌కు తీసుకెళ్లేందుకు సిద్ధం చేస్తున్న కూలీలు

గడివేముల: ఎండు మిర్చి పంట.. రైతులకు మంట పుట్టిస్తోంది. పంట ధరలు అమాంతం పడిపోవడంతో వచ్చే ఆదాయం ఖర్చులకు కూడా సరిపోక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉద్యానవన పంటల్లో మిర్చి ప్రధానమైంది. ప్రతి రోజూ వంటకాల్లో వాడుకోవాల్సి ఉన్నప్పటికీ.. ఎండు మిర్చి ధర మాత్రం పడిపోయింది. ఒకవైపు ప్రకృతి అనుకూలించక, మరోవైపు ధర పడిపోవడంతో మిర్చి రైతుల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. దళారులు సిండికేట్‌గా మారి పంటను తక్కువ ధరకు కాజేసి అన్నదాతలకు అన్యాయం చేస్తున్నారు. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటకు గిట్టుబాటు ధరలు లేక రైతులు దిగాలు చెందుతున్నారు. విత్తన దశలో పంట ధరలు అధికంగా ఉండడంతో ఎక్కువ మంది రైతులు మిర్చి పంటపై ఆసక్తి చూపారు. మండల కేంద్రమైన గడివేములతో పాటు బిలకలగూడూరు, మంచాలకట్ట, గని, కొర్రపోలూరు, తిరుపాడు గ్రామాల్లో ఎక్కువగా మిరప పంటను సాగు చేశారు. ఈ ఏడాది మండలంలో 1500 ఎకరాల్లో సాగు చేశారు. రెండేళ్ల నుంచి ఎండు మిర్చి పంట సాగుచేసిన రైతులు అధిక లాభాలు ఆర్జించారు. ఈ ఏడాది కూడా లాభాలు వస్తాయని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది.

వైరస్‌తో దెబ్బతిన్న పంట

ఈ ఏడాది మిర్చి పంట సాగు విస్తీర్ణం పెరిగింది. ఒకేసారి దిగుబడి రావడంతో ధర గణనీయంగా తగ్గింది. మిర్చి నిల్వ చేసుకోవడానికి వసతులు లేకపోవడమే ధర తగ్గడానికి కారణమని రైతులు అంటున్నారు. వైరస్, నల్లదోమ, తామర పురుగు వల్ల మిర్చి పంట కొంత దెబ్బతింది. దీంతో మిర్చి పంటను తొలగించి వేరే పంటలు సాగు చేశారు. ఎకరాకు 30 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని ఆశించిన రైతులకు 15 కింటాళ్లు వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. అరకొరగా వచ్చిన దిగుబడులకు ధర లేకపోకపోవడంతో చాలా నష్టం వచ్చే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దిగుబడిని గుంటూరు మిర్చి యార్డ్‌కు తరలించి అమ్ముకుంటారు.

భారీగా తగ్గిన ధర

ఈ ఏడాది పచ్చిమిర్చి ధర పూర్తిగా తగ్గిపోయింది. రెండేళ్ల నుంచి క్వింటా రూ.23 వేల నుంచి రూ 26 వేల వరకు పలికింది. ఇదే విధంగా ధర ఉంటుందని ఈ ఏడాది ఎక్కువ మంది రైతులు సాగు చేశారు. ఎకరాకు దుక్కులు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కూలీలు కలుపుకుని రూ.1.80 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు చేశారు. ఎకరాకు 25 క్వింటాళ్ల నుంచి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. క్వింటా ప్రస్తుతం రూ.11 వేల నుంచి రూ. 13 వేల వరకు పలుకుతోంది. భారీగా నష్టం రావడంతో ఏం చేయాలో తెలియక రైతులు సతమతమవుతున్నారు. గిడ్డంగి సౌకర్యం కల్పించి ధర తక్కువ ఉన్నప్పుడు నిల్వ చేసుకుని ఎక్కువ ధర వచ్చినప్పుడు అమ్ముకునే అవకాశం కల్పించాలని రైతులు కోరుతున్నారు.

పంటను దున్నేశాను



బోరు కింద 11 ఎకరాల నాటు, తేజ రకం మిరప పంటను సాగు చేశాను. దాదాపు ఎకరాకు రూ.2లక్షల పెట్టుబడి పెట్టాను. తామర పురుగుతో 3 ఎకరాల మిరప పంట పూర్తిగా దెబ్బతినడంతో దున్నేసి వేరే పంటను వేశాను. మిగతా 8 ఎకరాల కాయను కోసిన తరువాత అధికంగా తాలుకాయ ఎక్కువగా వచ్చింది. దీంతో ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. లాభం వచ్చే పరిస్థితి లేదు.

–పైపాలెం ఉసేని, మిరప రైతు, గడివేముల

పెట్టుబడి కూడా వచ్చేలా లేదు



నేను 6 ఎకరాల్లో తేజ రకం ఎండుమిర్చి సాగు చేశా. ఎకరానికి రూ.2 లక్షలు ఖర్చయింది. దిగుబడి బాగా వస్తుందని అనుకుంటున్న సమయంలో వైరస్, తామర పురుగు వల్ల పంట దెబ్బతింది. క్వింటా రూ.14 వేల నుంచి రూ.15 వేల వరకు మాత్రమే పలుకుతోంది. ఇదే కొనసాగితే కనీసం పెట్టుబడి కూడా వచ్చేలా లేదు. మిర్చిని నిల్వ చేసుకోవడానికి గిడ్డంగులు ఉంటే ధర వచ్చినప్పుడు అమ్ముకునే అవకాశం ఉంటుంది.

–తలారి బాలచెన్ని, మిర్చి రైతు, గడివేముల

ధర తగ్గుతుందని ఊహించలేదు



నేను 7 ఎకరాల్లో ఎండ మిర్చి సాగు చేశా. కొన్నేళ్ల నుంచి ఎండు మిర్చి సాగు చేస్తున్నాను. ఈ ఏడాది పంటలకు వివిధ రకాల వైరస్‌లు సోకడంతో పెట్టుబడి పెరిగింది. దిగుబడి మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. ధర ఎన్నడూ లేని విధంగా తగ్గిపోవడంతో తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉంది. అధికారులు, ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మిర్చి రైతులకు న్యాయం చేయాలి.

– కురువ శివ, మిర్చి రైతు, గడివేముల

మైనార్టీ శ్మశాన వాటికకు స్థల పరిశీలన


నన్నూరులో స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ విద్యాసాగర్

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు గ్రామంలో ముస్లింల శ్మశాన వాటిక కోసం స్థలాన్ని పరిశీలించినట్లు తహసీల్దార్ విద్యాసాగర్ తెలిపారు. నెల క్రితం గ్రామానికి చెందిన ముస్లింలు, బీసీలు శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించాలని తహసీల్దార్‌కు విన్నవించారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ విద్యాసాగర్ స్థానిక నాయకులతో కలిసి అనువైన స్థలాన్ని పరిశీలించారు. గ్రామం నుంచి మీదివేముల మార్గంలోని సర్వే నంబర్ 1084లో కమ్మ శ్మశాన వాటిక పక్కన ఉన్న చెత్త సంపద కేంద్రం నిర్మించిన స్థలాన్ని పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా చర్చలు జరిపిన అనంతరం సదరు స్థలాన్ని నిర్ధారించాల్సివుందని తెలిపారు. ఒకవేళ ఆ స్థలం నుంచి ఏమైనా అభ్యంతరాలు ఉంటే, మరోచోట స్థలాన్ని పరిశీలిస్తామని పేర్కొన్నారు. ఇందుకు గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు. స్థానిక నాయకులు విశ్వేశ్వరరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, తలారి విజయుడు, ఖాజామియా, శంషుద్దీన్, కటిక హసన్, సర్దార్‌ఖాన్, వడ్లబాషా, అహ్మద్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త


ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డాక్టర్

సి.బెళగల్: సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని సి.బెళగల్ పీహెచ్‌సీ డాక్టర్ మిథున్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాతావరణ మార్పులతో జలుబు, దగ్గు, శ్వాసకోశ సంబంధ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వారికి అవసరమైన వైద్య సేవలను అందించాలని తెలిపారు. అదే విధంగా గర్భిణులకు రెగ్యులర్ వైద్య పరీక్షలను నిర్వహించి, అవసరమైన సలహాలు, సూచనలు, మందులను అందజేయాలని చెప్పారు. సమావేశంలో సీహెచ్‌ఓ ఉమామహేశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్లు మంగమ్మ, మద్దిలేటి, హెల్త్ ఎడ్యుకేటర్ సుజాత, టీబీ సూపర్‌వైజర్ నాగమహేంద్ర, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే విజయం సొంతం


విద్యార్థినులకు ప్రతిభా పురస్కారాలు అందజేసిన బ్యాంక్ మేనేజర్ శివకృష్ణ

ఓర్వకల్లు: గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ప్రణాళికతో చదివితే విజయం సొంతం అవుతుందని హుసేనాపురం ఏపీజీబీ బ్రాంచ్ మేనేజర్ శివకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని సోమయాజులపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను ప్రోత్సహించే దిశగా ప్రతిభ పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాలకు చెందిన లిఖిత(7వ తరగతి), మధులత(8వ తరగతి), పరిమళ(9వ తరగతి)ను ప్రతిభా పురస్కారాలకు ఎంపిక చేసి, ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున నగదును అందజేశారు. హెచ్‌ఎం లిల్లీపుష్పారాణి మాట్లాడుతూ.. ఏపీజీబీ ప్రోత్సాహం మరువరానిదని, మరికొంత మంది విద్యార్థులకు స్ఫూర్తినింపి వారి ప్రగతికి బాటలు వేయాలని అభిప్రాయపడ్డారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థినులు ప్రతిభా పురస్కారానికి ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు రమణ, శేఖర్‌రెడ్డి, సుభాషిణి, నిర్మలాదేవి, భారతి, యోగీశ్వరరెడ్డి, తిప్పన్న, సుశీలమ్మ, పరిమళ తదితరులు పాల్గొన్నారు.

దళిత కాలనీల్లో సమస్యలను పరిష్కరించండి


వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఓర్వకల్లు: మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు మహేంద్ర మాదిగ, నారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలనాధికారి వెంకటరామయ్యను కలిసి పలు సమస్యలను విన్నవించారు. చాలా గ్రామాల్లోని దళిత కాలనీల్లో తాగునీరు, సీసీ రోడ్లు, మురుగు కాలువలు, వీధి దీపాలు లేక అంధకారంలో జీవిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా మహిళలకు సామూహిక మరుగుదొడ్లు లేక ఊరుబయట కంపచెట్లు, ముళ్లపొదలు, మొండిగోడల మధ్యనే కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శ్మశాన వాటికలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయని తెలిపారు. సంఘం నాయకులు ఉయ్యాలవాడ రామకృష్ణ, లక్ష్మన్న, నారాయణ, మహేష్, కోటకొండ సురేష్, గుండమయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎయిడెడ్ పాఠశాలలో తనిఖీలు


విద్యార్థుల వివరాలను పరిశీలిస్తున్న ఎంఈఓలు

కోడుమూరు రూరల్: గూడూరులోని ఏబీఎం ఎయిడెడ్ ప్రైమరీ పాఠశాలను మంగళవారం ఎంఈఓలు సునీలమ్మ, నాగరాజు తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎయిడెడ్ పాఠశాలల్లోని విద్యార్థుల వివరాలు, స్థితిగతులను తెలుసుకునేందుకు విద్యాశాఖాధికారులతో తనిఖీలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా గూడూరు ఎంఈఓలు ఎయిడెడ్ పాఠశాలలో తనిఖీలు నిర్వహించి విద్యార్థుల వివరాలను పరిశీలించారు. పాఠశాలలో మొత్తం 56 విద్యార్థులకు గాను మంగళవారం 34 మంది విద్యార్థులు మాత్రమే హాజరైనట్లు ఎంఈఓలు గుర్తించారు. తనిఖీల వివరాలను జిల్లా అధికారులకు పంపుతున్నట్లు ఎంఈఓలు పేర్కొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు


కొత్తూరు రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్

పాణ్యం: రాష్ట్ర ప్రభుత్వం భూసమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులు మంగళవారంతో ముగిశాయి. డిసెంబర్ 6వ తేదీ బలపనూరు గ్రామంలో ప్రారంభమైన సదస్సులు కొత్తూరు గ్రామంతో ముగిశాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సుల్లో రైతులు, భూసమస్యలు ఉన్న వారు అర్జీలు అందజేశారని తెలిపారు. ప్రజలు ఇచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేశామన్నారు. త్వరలోనే వీటికి పరిష్కారం చూపుతామన్నారు. మండలంలో మొత్తం 517 అర్జీలు రాగా వీటిలో 74 అర్జీలు పరిష్కరించినట్లు చెప్పారు. అలాగే కొలతల్లో తేడా, మ్యుటేషన్, మార్పులు, చేర్పులకు దరఖాస్తులు వచ్చాయన్నారు. త్వరలోనే వీటికి పరిష్కారం చూపుతామన్నారు. టీడీ శివశంకర్‌రెడ్డి, ఆర్ఐ రామ్, సర్పంచ్ రాజేశ్వరమ్మ, ఎంపీటీసీ లక్ష్మీదేవి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలకు సత్వర పరిష్కారం

కర్నూలు (రూరల్): భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ శివప్రసాద్ సూచించారు. మండల పరిధిలోని సుంకేసుల గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. భూ సమస్యలపై ఏడుగురు రైతులు అర్జీలు అందజేసినట్లు డీటీ తెలిపారు. వాటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గిడ్డమ్మ, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

భూసమస్యలపై అర్జీల స్వీకరణ

కల్లూరు: గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల సర్వేయర్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం తడకనపల్లె గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 8 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సహెరాబీ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలి


ఆందోళన చేస్తున్న కార్మిక సంఘం నాయకులు

ఓర్వకల్లు: మండలంలోని గుట్టపాడు సమీపంలో ఉన్న జైరాజ్ ఇస్పాత్ స్టీల్ ప్లాంట్‌లో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక స్టీల్ ప్లాంట్ రహదారిపై కార్మికులతో కలిసి ఆందోళన చేశారు. ఇచ్చే చాలీచాలని జీతాలను కూడా సకాలంలో ఇవ్వకపోవడం దారుణమన్నారు.

సైబర్ నేరాలపై వర్క్‌షాప్



పాణ్యం: నెరవాడమెట్ట వద్ద ఉన్న శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై విద్యార్థులకు 25 రోజుల వర్క్‌షాప్‌ను ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిజిటల్ యుగంలో సైబర్ నేరాలపై అవగాహన అవసరమని తెలిపారు. సైబర్ నేరాలను నిర్ధారించడం కీలకమన్నారు. ఈ వర్క్‌షాప్ సురక్షితమైన, భద్రమైన డిజిటల్ వాతావరణాన్ని ప్రొత్సహించే దిశగా ఒక ముందడుగు అని పేర్కొన్నారు. రిసోర్స్ పర్సన్ అమిత్‌కుమార్ మాట్లాడుతూ.. వర్క్‌షాప్‌లో సైబర్ ముప్పులను గుర్తించడం, రిస్క్ మేనేజ్‌మెంట్, డేటా ప్రొటెక్షన్, సైబర్ సెక్యూరిటీ, నూతన టెక్నాలజీపై తరగతులు ఉంటాయన్నారు. కో-ఆర్డినేటర్ లక్ష్మీచైతన్య, సీఎస్ఈ విభాగం అధిపతి ఫరూక్ పాల్గొన్నారు.

పింఛన్ లబ్ధిదారులకు నోటీసులు


బురాన్‌దొడ్డిలో లబ్ధిదారుడికి నోటీసు అందజేస్తున్న ఉద్యోగి

సి.బెళగల్: మండలంలో ఆరోగ్య సమస్యల (కిడ్నీ డయాలసిస్, తలసేమియా)తో పింఛన్ తీసుకునే లబ్ధిదారులకు సచివాలయ ఉద్యోగులు నోటీసులు అందజేశారు. మొత్తం 11 గ్రామ సచివాలయాల పరిధిలో 27 మంది కిడ్నీ డయాలసిస్, తలసేమియా వ్యాధిగ్రస్తులు రూ.10 వేలు, రూ.15 వేల చొప్పున పింఛన్లు పొందుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తనిఖీల్లో భాగంగా ఆయా గ్రామ సచివాలయ ఉద్యోగులు నోటీసులు అందజేశారు. బుధవారం (నేడు) వైద్య అధికారులు, మండల అధికారుల తనిఖీలు చేయనున్నారని.. ఇళ్ల వద్ద అందుబాటులో ఉండాలని అందులో పేర్కొన్నారు. బ్రాహ్మణదొడ్డి సచివాలయంలో ఒకరు, బురాన్‌దొడ్డిలో-2, సి.బెళగల్ 1, 2 సచివాలయాల్లో 10, కంబదహాల్‌లో 3, కొండాపురంలో 2, ముడుమాల, పోలకల్-3లో 1, కొత్తకోట, ఈర్లదిన్నెలో ఇద్దరు చొప్పున మొత్తం 27 మంది పింఛన్లు తీసుకుంటున్నారు.

సౌత్‌జోన్ పోటీల్లో ప్రతిభ చాటాలి


ఆర్‌యూ చెస్ జట్టుకు క్రీడాదుస్తులు అందిస్తున్న వీసీ ఎన్‌టీకే నాయక్

కర్నూలు (టౌన్): చెన్నైలోని వెల్‌టెక్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్న సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల చెస్ పురుషుల పోటీల్లో ప్రతిభ చాటాలని రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ సూచించారు. మంగళవారం వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో.. చెస్ పోటీల్లో పాల్గొనే పురుషుల జట్టుకు వీసీ క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెస్ పురుషుల పోటీల్లో సత్తా చాటి వర్సిటీకీ మంచి పేరు తీసుకురావాలని కోరారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బోయ విజయ్‌కుమార్ నాయుడు పాల్గొన్నారు. అనంతరం వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.వి.శివకిషోర్ చెస్ పురుషుల జట్టు వివరాలు వెల్లడించారు. జట్టులో రంగస్వామి, రమేష్, సమీర్, వినోద్‌కుమార్, జశ్వంత్, పవన్‌కుమార్ ఉన్నారు.

గర్భస్థ పిండ లింగనిర్ధారణ పరీక్షలు నేరం



లింగ నిర్ధారణ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయిస్తున్న బి.లీలా వెంకటశేషాద్రి, ఎం.వెంకట హరినాథ్ తదితరులు

కర్నూలు సిటీ: క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి, శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు ఎం.వెంకట హరినాథ్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్ ప్రకారం గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలు నేరమని చెప్పారు. ఏ స్కానింగ్ సెంటర్‌లోనైన లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే శిక్ష తప్పదని, మహిళల హక్కులు, రక్షణ చట్టాల గురించి వివరించారు. ఉచిత న్యాయ సహాయం, లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ సెంటర్ 15100, చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబరు 1098 గురించి వివరించారు. అనంతరం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి పి.శాంతికళ మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో లింగ నిర్ధారణ వ్యతిరేక ప్రతిజ్ఞను జిల్లా ప్రోగ్రాం కన్సల్టెంట్, న్యాయవాది సుమలత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ దేవికా రాణి, రాయపాటి శ్రీనివాస్, డిప్యూటీ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్ రెడ్డి, పి.హేలాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్


మండల స్థాయి పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు


కబడ్డీలో హోరాహోరీగా తలపడుతున్న విద్యార్థులు

గడివేముల: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారులను వెలికితీసేందుకు నిర్వహించే క్రీడలు ఎంతగానో ఉపయోగపడుతాయని జిందాల్ సిమెంట్ ప్లాంట్ హెడ్ నవనీత్ కుమార్ చౌహాన్ అన్నారు. మంగళవారం జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభించారు. జెఎస్‌డబ్ల్యూ సీఎంఓ సుమిత్ శడ్డా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా గడివేముల పాతబస్టాండ్ నుంచి జెడ్పీహైస్కూల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థినులకు కబడ్డీ, కోకో పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ మేరి సునీత, సీఎస్ఆర్ మేనేజర్ రవికుమార్, ఎస్ఐ నాగార్జునరెడ్డి, రాజరాజేశ్వరి కరస్పాండెంట్ రామేశ్వరరావు, హెచ్‌ఎం విక్టర్ ఇమ్మానియేల్, పీఈటీలు భుజంగరావు, కవిత, వెంకటేశ్వర్లు, ఎల్లరాముడు, రవి పాల్గొన్నారు.